సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 30 । మార్చి । 2025







ఉషస్సుల ఉగాది నవ్యతకు నాంది

గుమ్మానికి తోరణాలు.. వాకిట్లో రంగవల్లులు.. కొత్త దుస్తుల మెరుపులు.. పిండి వంటల ఘుమఘుమలు.. షడ్రుచుల సమ్మేళనం పచ్చడి.. తెలుగు లోగిళ్లలో కొత్త సంవత్సర సందడి మొదలైంది. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. ఉగాది పండగకు జిల్లా సర్వం సిద్ధమైంది. కొత్త సంవత్సరం ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఆతృతతో ప్రజలు పంచాంగ శ్రవణం కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు కవి సమ్మేళనాల్లో పండితుల పాండిత్యం, కవుల కవితాఝరి మనోరంజకంగా సాగడానికి సిద్ధమవుతోంది. ఉగాది సందర్భంగా మామిడి కాయలు మార్కెట్లను ముంచెత్తాయి. ఉగాది పచ్చడికి కావలసిన మామిడి, వేప పువ్వు, ఇతర పదార్థాలను కొనుగోలు చేయడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జిల్లాలోని మార్కెట్‌లు సందడిగా మారాయి. కొత్త ఆశలు, కొత్త ఆశయాలతో **ఈ సంవత్సరం**లో అందరికీ శుభాలు కలగాలి. -ఫొటోలు : సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రారంభపు నిల్వ	అన్ని పద్దుల కింద జమలు	ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమ	అన్ని పద్దుల కింద ఖర్చులు	ముగింపు నిల్వ	మేయర్ గొలగాని హరి వెంకట కుమారి వెల్లడి
రూ.482.26 కోట్లు	రూ.4,279.61 కోట్లు	రూ.4,761.87 కోట్లు	రూ.4,601.40 కోట్లు	రూ.160.47 కోట్లు	



మహా బడ్జెట్

రూ.4,761.87 కోట్లు

రాజీనామా చేయాలి



కమిషనర్‌ను నియమించుకోలేని కూటమి నాయకులు రాజీనామా చేయాలి. కమిషనర్‌ను వెంటనే నియమించాలంటూ సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన మీకు **తెలియదా?**

-జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

గౌరవం ఉన్నట్లు లేదు



బడ్జెట్ నిర్వ**హించే విష**యమై **అధికారులు** వివరణ ఇచ్చి**నా కూటమి** సభ్యులు రెచ్చి**పోతున్నా**రు. బడ్జెట్ సాగనివ్వకుండా అడ్డుతగులుతున్నారు. మీకు జీవీఎంసీ ఉద్యోగులన్నా.. నగర పౌరులన్నా గౌరవం లేనట్టుంది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో దళిత ప్రాంతాలు అభివృద్ధి జరపాలి. ముఖ్యంగా జనరల్ ఫండ్స్‌తోపాటు జనరల్ కాంట్రాక్టర్స్ పిలవండి.

- కటుమూరి సతీష్, డిప్యూటీ మేయర్

ఆదాయం ఇలా..

2025–26 సంవత్సరానికి ఆదాయంలో సాధారణ జమల కింద రూ.1,791.19 కోట్లు, మూలధన జమల కింద రూ.2,488.42 కోట్లు. మొత్తంగా రూ.4,279.61 కోట్లుగా చూపారు. అన్ని పద్దుల కింద ప్రారంభపు నిల్వతో కలిపి 4,761.87 కోట్లు జమలుగా ఆశించారు. 2024–25 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో సాధారణ జమలు కింద రూ.1,642.51 కోట్లు, మూలధన జమలు కింద రూ.2,428.22 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి రూ.5,064.80 కోట్లుగా చూపారు. 2024–25 ఏడాదికి ఆశించిన జమలు కన్నా 2025–26 ఏడాదికి ఆశించిన జమల్లో రూ.302.93 కోట్ల తగ్గుదల ఏర్పడింది.

పన్నులు ఇలా..

జీవీఎంసీ వసూలు చేస్తున్న ఇంటి పన్ను, ఖాళీ జాగాపన్ను, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు చార్జీలు, స్టీల్‌ప్లాంట్, పోర్టు తదితర పారిశ్రామిక సంస్థలు చెల్లించాల్సిన పన్నులు, సర్వీసు చార్జీలు, ప్రకటన చార్జీలు, సెల్‌టవర్స్ చార్జీలు, జంతువులపై పన్ను తదితరవి ఈ పద్దు కింద 2025–26 ఏడాదికి రూ.699 కోట్లుగా చూపారు.

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 2025–26 వార్షిక బడ్జెట్‌ను శనివారం కౌన్సిల్లో ప్రవేశపెట్టారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో సభ్యులు చర్చించి ఆమోదించారు. వైఎస్సార్ సీపీ సభ్యులతో పాటు కూటమి సభ్యులు(టీడీపీ, జనసేన, బీజేపీ), సీపీఎం, సీపీఐలు బడ్జెట్‌ను ఆమోదించడం గమనార్హం. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభపు నిల్వ రూ.482.26 కోట్లు. అన్ని పద్దుల కింద జమలు రూ.4279.61 కోట్లు. ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తంగా జమలు రూ.4,761.87 కోట్లు కాగా.. అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.4,601.40 కోట్లు. ముగింపు నిల్వగా రూ.160.47 కోట్లుగా నిర్ణయించినట్టు చెప్పారు. ఏఏ రంగానికి ఎంతెంత కేటాయించారో మేయర్ వివరించారు.

పన్నులు కాని ఇతర ఆదాయాలు

నీటి సరఫరా చార్జీలు, పట్టణ ప్రణాళికా విభాగం వసూళ్లు. షాపు రూముల అద్దెలు, కల్యాణమండపాల అద్దెలు, లీజులు, బల్క్, సెమీబల్క్, ఇతర నీటి సరఫరా చార్జీలు, వ్యాపార సంస్థల లైసెన్స్ ఫీజులు తదితరవి రూ.86.21 కోట్లుగా చూపారు.

ప్రభుత్వం నుంచి ఆదాయం

స్టాంప్ డ్యూటీపై సర్‌చార్జ్, వృత్తిపన్ను, తలసరి గ్రాంటు, మోటారు వాహనాల పన్ను, ఆస్తిపన్ను రాయితీ నష్టపరిహారాలు, మెజిస్ట్రీరియల్ జరిమానాలు తదితరవి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయంగా రూ.230 కోట్లుగా చూపారు.

బ్యాంకులు/ఆర్థిక సంస్థలు/ బాండ్లు ద్వారా రుణాలు

జోన్–2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి.. జీవీఎంసీ అవసరమైన వాటా రూ.553 కోట్లు బ్యాంకులు/ఆర్థిక సంస్థలు/బాండ్లు/ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల ద్వారా సమకూర్చుకునేందుకు ప్రతిపాదించారు.

ఖర్చుల అంచనాలు

తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రోడ్లు, ఫ్లైఓవర్లు, కాలువలు, భూగర్భ డ్రైనేజీ, పార్కులు, భవనాలు, కల్యాణ మండపాలు, ఆడిటోరియంలు, స్టేడియంల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన, అన్ని వార్డుల్లో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదలను అమలుకు వివిధ పద్దుల కింద బడ్జెట్ కేటాయించారు. 2025–26కి బడ్జెట్ అంచనాల్లో అన్ని పద్దుల కింద రూ.4601.40 కోట్లు అంచనా వేశారు. గతంలో చేపట్టి, పూర్తి కాని పనులు, ప్రస్తుతం సంవత్సరంలో మంజూరైన పనులు, జరుగుతున్న పనులకు సవరించిన అంచనాలు, బడ్జెట్ అంచనాలలో తగు కేటాయింపులు చేశారు.

కేటాయింపులు ఇలా..

- జోన్–2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.553 కోట్లు.
- రోడ్ల నిర్వహణ, గుంతలు పూడ్చడానికి రూ.77 కోట్లు, రోడ్ల యాన్యుటీకి రూ.70 కోట్లు, తాగునీటి కాలువల నిర్మాణం, నిర్వహణకు రూ.159 కోట్లు, సామాజిక భవనాల నిర్మాణానికి, నిర్వహణకు రూ.70 కోట్లు, వరద నీటి కాలువల నిర్మాణం, నిర్వహణకు రూ.12 కోట్లు, నగరంలో కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.120 కోట్లు, తారు రోడ్ల నిర్మాణానికి రూ.125 కోట్లు.
- నగరంలో ప్రధాన, సాధారణ రహదారుల్లో ఆధునిక విద్యుద్దీకరణకు రూ.14 కోట్లు, వీధి దీపాల నిర్వహణకు రూ.30 కోట్లు, పార్కుల విద్యుద్దీకరణకు రూ.7 కోట్లు.

మంచినీటి సరఫరాకు..

- నగరంలో మంచినీటి సరఫరా పథకాల నిర్వహణకు రూ.36 కోట్లు, పైపులైన్ల విస్తరణకు రూ.8 కోట్లు, గొట్టపు బావులు వేసేందుకు, నిర్వహణకు రూ.7.70 కోట్లు కేటాయించారు.
- రిజర్వాయర్ల నిర్మాణం, నిర్వహణకు రూ.10.60 కోట్లు, అమృత్ ప్రాజెక్టుకు రూ.310 కోట్లు, ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుకు రూ.60 కోట్లు, కార్బన్ తీవ్రత నివారించేందుకు యూసీసీటీఆర్ఎఫ్ ప్రాజెక్టు ద్వారా స్వాపింగ్ స్టేషన్స్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు రూ.3.30 కోట్లు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల పనుల కోసం సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.450 కోట్లు ప్రతిపాదించారు.
- ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, స్త్రీ, శిశు సంక్షేమానికి 5 శాతం అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల్లో మొత్తంగా 27.5 శాతం తగ్గకుండా రూ.239.24 కోట్లు కేటాయించారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ హరేందిర ప్రసాద్

విద్యా విభాగం

బాల్యం పథకం కింద 3 నుంచి 7 ఏళ్లలోపు బాలలకు చిన్నబడి కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాలతో మున్సిపల్ పాఠశాలలు అనుసంధానం చేసి పౌష్టికాహారం, విద్య, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు రూ.1.50 కోట్లు, నగరంలోని ప్రధాన, సాధారణ, కాలనీ పార్కులు, ట్రాఫిక్ ఐల్యాండ్స్, సెంట్రల్ మీడియన్, వర్టికల్, గూఫ్ గార్డెన్స్ నిర్వహణ, అభివృద్ధికి రూ.56.10 కోట్లు, మియావాకీ అడవుల నిర్వహణ, అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించారు.

సభలో గందరగోళం

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బడ్జెట్‌ను ప్రసంగించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రతిపక్షాలు ఘెరావ్ చేశాయి. ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహణలో జాప్యమెందుకు జరిగిందో తెలపాలని కూటమి సభ్యులు పట్టుబట్టారు. దీనిపై అధికారులు వివరణ ఇస్తారని మేయర్ చెప్పారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో ప్రొసీడింగ్స్ ఇచ్చారని, డిసెంబర్ 14 నాటికి నాలుగైదు సమీక్షలు జరిగాయని, డిసెంబర్ 14న స్టాండింగ్ కమిటీ అప్రూవ్ చేసిందని వ్యయపరిశీలకుడు వాసుదేవరెడ్డి తెలిపారు. జనవరి 8న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖలో సమావేశం, ఆ తర్వాత సంక్రాంతి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యమైనట్లు పేర్కొన్నారు. అయినా కూటమి సభ్యులు నినాదాలు చేయగా.. ఇది బడ్జెట్ ప్రత్యేక సమావేశం.. కేవలం బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు మాత్రమే మాట్లాడాలని మేయర్ సూచించారు.

భయపడేవారు లేరు

సమావేశం అవుతుండగా కొంత మంది కూటమి కార్పొరేటర్లు గందరగోళం సృష్టిస్తూ.. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు భయపడినట్టుందని.. అందుకే బడ్జెట్ మీటింగ్‌కి రాలేకపోయారని పెద్ద ఎత్తున నినదించగా.. మేయర్ హరి వెంకటకుమారి ఘాటుగా స్పందించారు. ఇక్కడ ఎవరూ భయపడేవారు లేరంటూ సమాధానమిచ్చారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వుమెన్ వెల్ఫేర్‌కు కేటాయించిన నిధులు సక్రమంగా ఉపయోగించాలని సూచించారు. ఆస్తి పన్ను తగ్గించాలని, స్విమ్మింగ్ పూల్స్ ను జీవీఎంసీ నడపాలన్నారు.

నిధులన్నీ నగరాభివృద్ధికే..



ఎంపీ ల్యాడ్స్ రూ.10 కోట్లు నగరాభివృద్ధికి ఖర్చు పెడతా. జిల్లా కలెక్టర్‌కు రాజ్యసభ సభ్యుడంటే ఏమాత్రం గౌరవం లేకుండా పోయింది. పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానటరీ సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసం. ఆ సమావేశంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఎన్నో అంశాలుంటాయి. గాజువాకలో అంబేడ్కర్ విగ్రహం విరిగింది. ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాను. ఏవేవో కారణాలు చెబుతున్నారు. జీవీఎంసీ నుంచైనా విగ్రహానికి మరమ్మతులు చేపట్టండి.

-గొల్ల బాబూరావు, రాజ్యసభ సభ్యుడు

నువ్వా నేనా..





ముమ్మర సాధన చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు

నేడు ఢిల్లీ, హైదరాబాద్ ఢీ

విశాఖ స్పోర్ట్స్: వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఐపీఎల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) జట్లు హోరాహోరీ పోరుకు సిద్ధమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుండగా.. మ్యాచ్ నిర్వహణకు ఏసీఏ ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా.. ఈ వేదికపై ఇప్పటివరకు 16 ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగాయి. అయితే ఈ రెండు జట్లు ఇక్కడ ముఖాముఖిగా తలపడటం ఇది రెండోసారి. 2019లో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో మరో బంతి మిగిలి ఉండగా హైదరాబాద్‌పై ఢిల్లీ విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ ఎనిమిది వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ 19.5 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. సొంతగడ్డపై మరో విజయాన్ని అందుకోవాలని ఢిల్లీ ఉవ్విళ్లూరుతుండగా.. ఈ సారి గెలిచి గత ఓటమికి బదులు తీర్చుకోవాలని హైదరాబాద్ భావిస్తోంది. మరి ఈ పోరులో గెలుపు ఎవరిదో.?



విశాఖ క్రికెటర్ నితీశ్‌కుమార్ వ్యాయామం

నేడు, రేపు రిజిస్ట్రేషన్ సేవలు

'హాలిడే ఛార్జీలు' లేకుండానే రిజిస్ట్రేషన్లు

విశాఖ సిటీ: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో రెండు సెలవు రోజుల్లోను రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగనున్నాయి. ఆదివారం ఉగాది, సోమ వారం రంజాన్ అయినప్పటికీ.. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తెరుచుకోనున్నాయి. సాధారణంగా సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ సేవలకు హాలిడే రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.5 వేలు వసూలు చేసేవారు. కానీ ఈ రెండు రోజులు మాత్రం ఆ హాలీడే రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండానే.. రిజిస్ట్రేషన్ సేవలు అందించనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ బాలకృష్ణ తెలిపారు.

నేడు వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఉగాది వేడుకలు

మహారాణిపేట: సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం విశ్వావసు నామ ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. వేదపండితుల వేదపారాయణం, ఆశీర్వచనం, పంచాంగ పఠనం, కవి సమ్మేళం ఉంటుందన్నారు. ఉగాది పచ్చడితో పాటు సంప్రదాయ ప్రసాదాలను ప్రజలకు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. పలు పాఠశాలల విద్యార్థులు, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ధాన్యం సేకరణకు రేపే ఆఖరు తేదీ

మహారాణిపేట: జిల్లాలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం సేకరణ ఈ నెల 31తో ముగుస్తుందని జేసీ మయూర్ అశోక్ తెలిపారు. 2024–25లో 10 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నామన్నారు. ఈ నెల 31లోగా రైతులు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లాలని జేసీ సూచించారు.

చేదెక్కిన ఉగాది

సూపర్ సిక్స్ హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం



సాక్షి, విశాఖపట్నం: తెలుగువారి కొత్త సంవత్సరం ఉగాది షడ్రుచులతో కళకళలాడాల్సిన సమయం. కానీ సూపర్ సిక్స్ పేరుతో ఆరు రుచులు పంచుతామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేదు మాటలు వినిపిస్తోంది. ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో ఓట్లు దండుకున్న చంద్రబాబు అండ్ కో.. అధికారంలోకి వచ్చి తొలి ఉగాది వచ్చినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. దీంతో ప్రజల ఆశలు అడియాసలయ్యాయి. అధికారంలోకి రాక ముందు ఒక మాట.. వచ్చాక మరో మాట చెప్పడం చంద్రబాబుకు అలవాటే. నోటికొచ్చిన హామీలిచ్చి వాటిని అమలు చేయకపోవడం లేదా నిబంధనల పేరుతో కాలయాపన చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. సూపర్ సిక్స్‌తో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఊదరగొట్టిన నేతలు ఇప్పుడు భయపడుతూ, అమలు చేయడం సాధ్యం కాదని చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారు. సూపర్ సిక్స్ హామీలతో ప్రజల జీవితాలను పండగ చేస్తామన్న కూటమి ప్రభుత్వం.. పది నెలల పాలనలో వారి ఆశలను అడియాసలు చేసి చేదుగా మార్చేసింది.

మహిళలకు 'చేదు'అనుభవాలేనా?

ప్రతి మహిళను ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతీ మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కానీ పది నెలలైనా ఒక్క మహిళ ఖాతాలో కూడా రూపాయి జమ కాలేదు. ఇప్పుడు రూ.1500 కాదు కదా, 15 రూపాయలు కూడా ఇవ్వలేమని చేతులెత్తేశారు. జిల్లాలో 9,21,561 మంది మహిళలకు నెలకు దాదాపు రూ.138.23 కోట్లు ఇవ్వాల్సి ఉంది.

నిరుద్యోగులకు 'వగరు'జీవితమే!

బాబు వస్తే జాబు వస్తుందని ఆశించిన నిరుద్యోగుల జీవితాలు ఈ ప్రభుత్వ హయాంలో వగరుగా మారాయి. 2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఈసారి కూడా ఇంటికో ఉద్యోగం లేదా రూ.3 వేలు భృతి ఇస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు దాని ఊసే లేదు. జిల్లాలో దాదాపు 4.5 లక్షల మంది నిరుద్యోగులు ఉండగా, వారికి నెలకు రూ.135 కోట్లకు పైగా భృతి ఇవ్వాల్సి ఉంటుంది. పైగా ఈ ప్రభుత్వంలో మొదటి సంతకానికి దిక్కులేకుండా పోయింది. డీఎస్సీ ఎప్పుడు వస్తుందా అని ఉపాధ్యాయ నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

'పులుపు'క్కిన ఉచిత సిలిండర్ల పథకం

ప్రతి ఇంటికీ ఏడాదికి 3 సిలిండర్లు ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక అనేక నిబంధనలు పెట్టడంతో సగం మందికి కూడా ఉచిత సిలిండర్లు అందడం లేదు. కొందరికి రాయితీ కూడా రావడం లేదు. పైగా మొదటి సంవత్సరం ఒక సిలిండర్‌తో సరిపెట్టేశారు. దీంతో ఈ పథకం కూడా పులుపెక్కిపోయిందని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. జిల్లాలో 8,90,345 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, తెల్ల రేషన్ కార్డుదారులు 5,12,619 మంది ఉన్నారు. కానీ అర్హులుగా గుర్తించింది కేవలం 37,385 మందిని మాత్రమే.

ఫ్రీ బస్సు పేరుతో కంట్లో 'కారం'చల్లారు

కర్ణాటక, తెలంగాణలో అమలు చేసిన ఫ్రీ బస్సు పథకాన్ని కాపీ కొట్టి సూపర్ సిక్స్‌లో పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక జిల్లా పరిధిలో మాత్రమే ఉచితమన్నారు. కానీ ఆ పథకం ఇంతవరకు అమలు చేయకుండా మహిళల కంట్లో కారం చల్లారు. ఈ ఉగాదికైనా ఫ్రీ బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందని ఎదురు చూసిన మహిళలకు నిరాశే ఎదురైంది. జిల్లాలో 11,70,705 మంది మహిళలు ఈ పథకానికి అర్హులు.

తల్లికి 'తీపి'వందనం ఎప్పుడో?

తల్లులందరికీ వందనం అంటూ ఎన్నికల వేళ వంగివంగి దండాలు పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఇంతవరకు ఆ హామీని అమలు చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో పిల్లల చదువు కోసం ఏటా రూ.15,000 చొప్పున ఇచ్చింది. కానీ ఈ ప్రభుత్వం మాత్రం దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ వాయిదాలు వేస్తూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. గత ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.1,114.52 కోట్లు అందించింది. తల్లికి వందనం పథకం కింద జిల్లాలో లబ్ధిదారులు 3,39,967 మంది ఉండగా, ఏడాదికి రూ.510 కోట్లు అవసరం.

'ఉప్పు'లేని 'భరోసా'తో చప్పిడి కూడే గతి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఖరీఫ్ సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందించింది. ఈసారి అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. ఇప్పటివరకు పైగా భరోసా ఇవ్వకపోవడంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు. షడ్రుచుల పండగకు ఉప్పులేని చప్పిడి మెతుకులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 27,365 మంది రైతులు ఉండగా, గత ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.83.86 కోట్లు అందించింది. ఈ ప్రభుత్వం ఏడాదికి ఒక్కో రైతుకు రూ.20,000 చొప్పున మొత్తం రూ.54.73 కోట్లు ఇవ్వాల్సి ఉంది.

నకిలీ బంగారంతో టోకరా

- బ్యాంకులో తాకట్టుపెట్టి రూ.68 లక్షలు రుణం
- తీరా విడిపించి పరిశీలించగా నకిలీదని తేలిన వైనం

సీతమ్మధార: నకిలీ బంగారంతో ఓ వ్యక్తిని మోసగించిన ఘటనపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ డి.వి.రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన శ్రీనాథ్ అనే వ్యక్తి బెంగళూరులో ఉంటున్నాడు. ఆయనకు నగరానికి చెందిన ఈశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. పూర్వీకుల బంగారం తన వద్ద ఉందని దాన్ని తాకట్టుపెట్టి రుణం ఇప్పిస్తే కమీషన్ ఇస్తానని చెప్పాడు. అతడు ఇచ్చిన రెండు కేజీల 900 గ్రాముల బంగారాన్ని ఈశ్వరరావు రాంనగర్‌లో గల రూపిక్ బ్యాంకులో రూ.68 లక్షలకు తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. కొన్నాళ్ల తరువాత బ్యాంకు నుంచి బంగారం విడిపించాలని ఈశ్వరరావు భావించాడు. బంగారం క్రయవిక్రయాలు చేసేజగదీశ్వరరావును మధ్యవర్తి ద్వారా కలిశాడు. రూ.68 లక్షలు విలువ చేసే బంగారం బ్యాంకులో ఉండిపోయిందని నగదు కావాలని అడిగాడు. దీంతో జగదీశ్వరరావు ఆ నగదు చెల్లించి బంగారం విడిపించాడు. తీరా బంగారాన్ని పరిశీలించగా అది నకిలీదని తేలడంతో మోసపోయానని గ్రహించిన జగదీశ్వరరావు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈశ్వరరావు పరారీలో ఉన్నాడు.

నేడు మంత్రి లోకేష్ విశాఖ రాక

తాటిచెట్లపాలెం: మంత్రి నారా లోకేష్ ఆదివారం విశాఖకు రానున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు 1.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియానికి చేరుకుని ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షిస్తారు. అనంతరం రామ్‌నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం నోవాటెల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అనకాపల్లి లేపాక్షి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. తరువాత అచ్యుతాపురం వెళ్తారు.

అత్తామామల హత్యకు కుట్ర

- సుఫారీ ఇచ్చిన అల్లుడు
- రూ.30 వేలు అడ్వాన్స్
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

కూర్మన్నపాలెం: అత్తామామలను హత్య చేయడానికి కుట్ర పన్నిన అల్లుడిని దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భార్య, కుమారుడిని కలవకుండా అడ్డుకుంటున్నారనే కోపంతోనే నిందితుడు ఈ పథకం వేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఈ వివరాలు వెల్లడించారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో చల్లంగి సూర్యనారాయణ విధులు నిర్వర్తిస్తున్నారు. అగనంపూడిలో భార్య సరస్వతితో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరి కుమార్తె మౌనికను కరణం శ్రీనివాస్ నాలుగేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. మనస్పర్థల కారణంగా మౌనిక కొడుకుతో సహా తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. తన భార్యను, కొడుకును అత్తమామలే కలవకుండా చేస్తున్నారనే ఉద్దేశంతో వారిపై శ్రీనివాస్ కక్ష పెంచుకున్నాడు. తన అత్తామామలను చంపితే లక్ష రూపాయలు ఇస్తానని ఒక వ్యక్తితో అతను ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందుగా రూ.30 వేలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. సూర్యనారాయణ విధులకు వెళ్లి వచ్చే సమయంలో వాహనంతో ఢీకొట్టి చంపి, దానిని ప్రమాదంగా చిత్రీకరించాలని శ్రీనివాస్ పథకం వేశాడు. ఈ విషయంపై అనుమానం వచ్చిన సూర్యనారాయణ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేశాడు. దీంతో సీపీ వెంటనే స్పందించి దువ్వాడ పోలీసులను అప్రమత్తం చేశారు. సీఐ మల్లేశ్వరరావు గట్టి నిఘా ఉంచి శ్రీనివాస్‌ను గమనించారు. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం సూర్యనారాయణ ఈ నెల 26న రాత్రి విధులు ముగించుకుని వస్తుండగా అగనంపూడి వద్ద కాపు కాసి మోటార్ సైకిల్‌తో ఢీకొట్టి హత్య చేయడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన సూర్యనారాయణ అక్కడి నుంచి తప్పించుకున్నాడని ఏసీపీ తెలిపారు. ఈ కేసులో శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ చెప్పారు. సమావేశంలో సీఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ త్రినాథ్

కొడుకు చేతిలో తండ్రి హతం

ఆరిలోవ డ్రైవర్స్‌కాలనీలో ఘటన

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో కన్న కొడుకు చేతిలో తండ్రి హతమయ్యాడు. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 11వ వార్డు పరిధి డ్రైవర్స్‌కాలనీలో పి.అప్పారావు(82) కుటుంబంతో నివాసముంటున్నాడు. అతను వృద్ధాప్య భారంతో చాదస్తం పెరిగి తరుచూ భార్యను కొడుతుండేవాడు. ఈ నేపథ్యంలో అడ్డువచ్చిన కుమారుడు బాలయోగిని దూషించేవాడు. అదే మాదిరిగా శనివారం రాత్రి తన భార్యను వేధించి చేయి చేసుకున్నాడు. ఇంట్లో ఉన్న కుమారుడు నిలదీయడంతో అతనిపై కూడా తిరగబడ్డాడు. దీంతో బాలయోగి ఇంట్లో దొరికిన బ్లేడుతో తండ్రిపై దాడి చేశాడు. ఆ బ్లేడు అప్పారావు గుండెపై లోతుగా కోసుకుపోయింది. దీంతో అధిక రక్తస్రావం జరిగి కుప్పకూలిపోయి అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే స్థానికుల సహాయంతో అప్పారావును కుమారుడు విమ్స్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడకు చేరే సరికే అప్పారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలయోగిని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

పౌరసేవలో 'పురమిత్ర'

- అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి
- మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అల్లిపురం: జీవీఎంసీ అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. ప్రజల కోసం జీవీఎంసీ యంత్రాంగం కృషి చేస్తుందనే భావన కల్పించాలని, విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా జీవీఎంసీ కమిషనర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అభివృద్ధి, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కావాల్సిన సేవలు అందించేందుకు పురమిత్ర యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా సేవలను మెరుగుపరుచుకునేందుకు వాట్సాప్ నంబర్ 95523 00009 ప్రవేశపెట్టిందన్నారు. నగరంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు సస్టైనబిలిటీ ఇనీషియేటివ్స్ 2025–26 డిస్ట్రిక్ట్ యాక్షన్ ప్లాన్ కింద ప్రణాళికలు చేపట్టాలన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్‌వీ సురేష్‌కుమార్, పీడీ యూసీడీ పీఎం సత్యవేణి, డీసీఆర్ ఎస్. శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారులు మీనా కుమారి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

మహారాణిపేట: విశాఖ నగర ప్రజలకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. చేదు అనుభవాలను మర్చిపోతూ.. ఆత్మీయత అనుబంధాలను పెంచుకుంటూ జీవించాలని తెలియజేసే పండగ ఉగాది అని అన్నారు.



నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

రిటైర్డ్ సిబ్బందికి సీపీ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితోసీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషరేట్ పరిధిలో తొమ్మిది మంది సిబ్బంది ఉద్యోగ విమరణ పొందారు. ఎస్ఐలు కె.సన్యాసిరావు, కె.కోటేశ్వరరావు, ఆర్ఎస్ఐలు జి.సత్యనారాయణ, ఎ.త్రిమూర్తులు, ఏఎస్ఐ డి.సత్యనారాయణ, హెచ్‌సీ ఎస్.శంకరరావు, ఏఆర్‌హెచ్‌సీ జి.శ్రీనివాసరావు, పీసీ ఎల్.వెంకటరత్నం, హోంగార్డు ఈ.సత్యనారాయణ రిటైర్ అయ్యారు. శనివారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వీరిని కుటుంబ సభ్యులతో పోలీస్ సమావేశ మందిరానికి ఆహ్వానించి సన్మానించారు. సిబ్బంది కుటుంబ సభ్యులతో మాట్లాడారు. 40 ఏళ్లు సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు.